ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

బుధవారం 22 మే 2024

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి 8లో..

కార్మిక కుటుంబాలకు కలుషిత నీరు సరఫరా 8లో..



సన్నాలకే రూ.500 బోనస్

- రేషన్ వినియోగదారులకు సన్న బియ్యం ఇచ్చేందుకే..
- దొడ్డు రకానికి ప్రకటించకపోవడంపై రైతుల అసంతృప్తి
- అన్ని రకాలకు ఇవ్వాలంటూ బీఆర్‌ఎస్ డిమాండ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా 500 రూపాయలు ఇస్తామని ప్రకటించింది. కానీ ఇప్పుడు కేవలం సన్న రకం ధాన్యానికే బోనస్ ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. గడిచిన ఏడాది నవంబరు నెలాఖరులో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో వరి ధాన్యానికి ప్రభుత్వం విధించిన మద్దతు ధర ఇవ్వడంతో పాటు క్వింటాలు ధాన్యానికి అదనంగా 500 రూపాయల బోనస్ ఇస్తామని, రైతులకు 2 లక్షల రూపాయల వరకు పంటల రుణ మాఫీ చేస్తామని, రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని రెండు సీజన్లలో 15 వేలు ఇస్తామని ప్రకటించింది. ఇంకా ఆరు గ్యారంటీ పథకాలను కూడా ప్రకటించింది. ఆ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ డిసెంబర్ 7న పాలన పగ్గాలు చేపట్టింది. ఆ తర్వాత పలు గ్యారంటీ పథకాలను అమల్లోకి తీసుక వచ్చింది. ఈ యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికే రూ. 500 బోనస్ ఇస్తుందని రైతులు ఆశపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో బోనస్ ఇవ్వలేదు. పెట్టు బడి సాయం కింద ఇస్తామన్న 15 వేల రూపాయలు ఇస్తారా, పాత పద్ధతిలోనే 10 వేలు ఇస్తారా అనే విషయమై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు ఒకేసారి 2 లక్షల రూపా యల వరకు పంటల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఇందుకు కావాల్సిన బడ్జెట్ కోసం ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది.

● బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు..

బోనస్ మాత్రం సన్న రకం వరి ధాన్యాన్ని పండించిన వాళ్లకే ఇస్తామని, ఈనెల 20వ తేదీన నిర్వహించిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రేషన్ షాపుల ద్వారా దొడ్డు రకం బియ్యంకు బదులు సన్న రకం బియ్యం ఇస్తామని కూడా ఎన్నికల హామీలో పేర్కొన్నది. ఆ విధంగా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు బోనస్ ప్రకటించింది. దీనిపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సన్న రకాల సేద్యం వల్ల పెట్టుబడులు ఎక్కువ కావడంతో పాటు దిగుబడులు తక్కువగా ఉంటాయని, తెగుళ్లు బాగా వస్తాయని, కాల వ్యవధి అధికంగా ఉంటుందని రైతులు అంటున్నారు. సన్న రకాల కంటే దొడ్డు రకాలను సాగు చేయడమే లాభాదాయకమని అంటు న్నారు. రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలంటే అవి పండించిన రైతులకు బోనస్ ఇస్తేనే పండిస్తారని ప్రభుత్వం భావిస్తున్నది. లేకుంటే ఎప్పటిలాగానే 30 శాతం సన్నాలు, 70 శాతం దొడ్డు రకం ధాన్యాన్ని పండిస్తారని అంటున్నారు. మరోపక్క ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని, దొడ్డు రకాలకు కూడా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన బాట పడతామని హెచ్చరిస్తున్నారు.

పెండింగ్ భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లిటౌన్, మే 21: జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కింద చేపట్టాల్సిన పెండింగ్ భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పెండింగ్ భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి, మంథని డివిజన్లకు సంబంధించి జాతీయ రహదారుల నిర్మాణం, సింగరేణికి సంబంధించి ఆర్‌జీ 1, 2, 3లలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సమీక్ష సమావేశంలో మంథని, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారులు హనుమా నాయక్, బి గంగయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి శ్రీనివాస్, సింగరేణి అధికారులు, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : సీఎండీ

గోదావరిఖని, మే 21: విజిలెన్స్ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న జైపూర్ విద్యుత్ కేంద్రం ఎస్‌ఈ కిరిటీ కుటుంబానికి అండగా ఉంటామని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని టీచర్స్‌కాలనీలో నివాసముంటున్న కిరిటీ తల్లిదండ్రులు రఘురామయ్య, కాశీఅన్నపూర్ణమ్మలను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరుపుతామన్నారు. కాగా డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్(ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్‌లు టీచర్స్ కాలనీకి వెళ్లి కిరిటీ కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ఉన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం

పెద్దపల్లి రూరల్, మే 21 : పెద్దపల్లి మండలం రంగాపూర్‌కు చెందిన దాడి విజయ్ ప్రమాదవశాత్తు గాయపడగా తోటి మిత్రులు మంగళవారం పరామర్శించి చికిత్స కోసం రూ.40వేల 500 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ ఆసుపత్రుల మార్కెటింగ్ యూనియన్ సభ్యులు గంగుల రాజు, చాటకొళ్ల శ్రీకాంత్, అదప సంతోష్‌కుమార్, రాపెల్లి రాజ్‌కుమార్, ఈదునూరి సాగర్, బూస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంచనాల్లో ఒకటి.. చేసేది మరొకటి..

- రామగుండం కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగం తప్పిదాలు - కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేలా పనులు

- పీసీసీ వేసి చేతులెత్తుతున్న కాంట్రాక్టర్లు - నెలల తరబడి సీసీ పనులు జరగక ప్రజల అవస్థలు



పీసీసీ వేసి వదిలేసిన ఫైర్ స్టేషన్ రోడ్డు



పీసీసీ వివాదాలను రేపిన మేకల మార్కెట్ రోడ్డు(ఫైల్)

కోల్‌సిటీ, మే 21: రామగుండం నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగం తీరు మారడం లేదు. అభివృద్ధి పనుల నిర్వహణలో నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. అంచనాల ప్రకారం పనులు చేయించకుండా కాంట్రాక్టర్ల ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తుండడంతో పనులు సగంలోనే నిలిచిపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అంచానాలు వేసి టెండర్లు చేసిన పనులకు సగంలోనే పనులను నిలిపివేసి నిధులు అయిపోయాయని కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. అంచనాల ప్రకారం కాంట్రాక్టర్లతో పనులు చేయించి రికార్డు చేయాల్సిన అధికారులు నిబంధనలను పక్కన పెట్టి లేని ఐటంలను చేర్చి చేయాల్సిన పనులను పక్కన పెట్టి బిల్లులు రికార్డు చేస్తున్నారు. దీంతో నగరపాలక సంస్థలోని పలు డివిజన్లలో సీసీ రోడ్ల పనులు అర్థాంతరంగా ఆగిపోతున్నాయి.

అంచనాలు వేసేది వారే.. ఉల్లంఘించేది వారే..

నగరపాలక సంస్థకు అభివృద్ధి పనులకు సంబంధించి ఇంజనీరింగ్ విభాగం అంచనాలు తయారు చేసి టెండర్లు నిర్వహిస్తుంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, ఓపెన్ డ్రైన్లు, మంచినీటి పైప్‌లైన్లు తదితర పనులకు సైట్ కండీషన్ల ప్రకారం అంచనాలు సిద్ధం చేస్తారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేసి సీసీ రోడ్లు నిర్మించాల్సిన చోట అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సీసీ రోడ్లకు అవసరానికి అనుగుణంగా నిధుల కేటాయింపు చేస్తారు. ఒక డివిజన్‌లో రూ.10లక్షలతో యూజీడీ, సీసీ రోడ్డు పెడితే మొదట యూజీడీ నిర్మించి తరువాత సీసీ రోడ్డు వేస్తారు. యూజీడీకి రూ.4లక్షలు అంచనాలు వేసి సీసీ రోడ్డుకు రూ.6లక్షలు అంచనాలు వేస్తే పనులు చేసే సమయంలో మాత్రం అంచనాలను తారుమారు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 10శాతం మేరే హెచ్చుతగ్గులకు అవకాశం ఉంటుంది. కానీ కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చే ఐటంలకే ప్రాధాన్యతనిస్తున్నారు. అవసరాన్ని మించి యూజీడీని పెంచడం, పాత లైన్లు తీసివేయడం, చాంబర్ల సంఖ్యను ఇష్టారీతిలో పెంచడం పనులు చేస్తున్నారు. తీరా సీసీ రోడ్డు వేసే సమయానికి నిధులు అయిపోయాయంటూ చేతులెత్తేస్తున్నారు.

పీసీసీతోనే సరి..

కార్పొరేషన్‌లో ఎక్కడా లేని కొత్త విధానానికి రామగుండం ఇంజనీరింగ్ తెరలేపింది. ప్రజల ఇక్కట్లు మాకేంటి అనే రీతిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సీసీ రోడ్డు నిర్మాణాల్లో నిబంధనలు గాలికి వదులుతున్నారు. జీఎస్‌టీ, పీసీసీ, రిచ్ మిక్స్ ఐటంలను చేరుస్తారు. మొదట జీఎస్‌టీ పూర్తయిన తరువాత పీసీసీ వేయాల్సి ఉంటుంది. రోడ్డు పొడవు, వెడల్పు బట్టి ఈ నిర్మాణాలు చేస్తారు. ముఖ్యంగా అంచనాలు, అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం పీసీసీ, సీసీ నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. మొదట పీసీసీ వేసి క్యూరింగ్ చేసిన తరువాత సీసీ వేయాల్సి ఉంటుంది. రామగుండంలో ఇంజనీర్లు కొత్త భాష్యం చెబుతున్నారు. సైట్ల వద్దకు వెళ్లకుండా ఎప్పటికప్పుడు లెక్కలు వేసుకోకుండానే పనులు చేయిస్తున్నారు. 100మీటర్ల రోడ్డు నిర్మాణం చేస్తే మొదట కాంట్రాక్టర్లు 100మీటర్లు పీసీసీ వేస్తున్నారు. దానిపై సీసీ వేసే సమయానికి మాత్రం టెండర్ వాల్యూ పూర్తయ్యిందంటూ 20 నుంచి 30 మీటర్లు సీసీ వేసి వదిలేస్తున్నారు. కొందరైతే అసలు సీసీలే వేయడం లేదు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ఫైర్ స్టేషన్ రోడ్డు, గంగానగర్, మేకల మార్కెట్ వంటి చోట వివాదాలు జరిగాయి. స్థానిక కార్పొరేటర్లు నానా ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. ఒక కార్పొరేటర్ అయితే ఏకంగా కార్పొరేషన్ కార్యాలయంలోనే ధర్నా చేశారు. రెండు చోట్ల పనులు పూర్తయినా ఫైర్ స్టేషన్ సమీపంలో మాత్రం ఏడాదిన్నరగా రోడ్డు అసంపూర్తిగానే ఉండిపోయింది. ప్రధాని రహదారి కావడం, ఫైర్ సర్వీస్‌కు అదే రోడ్డు కావడంతో జనం ఇక్కట్లు పడుతున్నారు.

విజిలెన్స్ తప్పు పడుతున్నా..

రామగుండం నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగం చర్యలను విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం తప్పుపడుతోంది. ఇప్పటికే కార్పొరేషన్ ఇంజనీర్ విభాగం కేంద్రంగా జరిగిన అవినీతి ఎవరి మెడకు చుట్టుకుంటుందోననే పరిస్థితి ఉంది. ఇప్పటికే పలు ఫిర్యాదులపై విచారణ చేసి విజిలెన్స్ విభాగం చర్యలకు సిఫార్సు చేసింది. అయినా కూడా ఇంజనీరింగ్ విభాగం తీరు మారడం లేదు.

పొరపాట్లు జరుగకుండా చర్యలు

- ఎస్‌ఈ చిన్నారావు

రామగుండం నగరపాలక సంస్థలో గతంలో అభివృద్ధి పనుల్లో కొన్ని ఉల్లంఘనలు జరిగినట్టు నా దృష్టికి వచ్చింది. భవిష్యత్‌లో అలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఇంజనీర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. అభివృద్ధి పనుల పర్యవేక్షణలో లోపాలు జరిగితే అధికారులు కూడా బాధ్యులవుతారు.

2030 నాటికి వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

- సమీక్ష సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని, మే 21: సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి విషయంలో భారీ దార్శనికతతో ముందుకు వెళుతున్నది... 2030వరకు సింగరేణి సంస్థ వార్షిక ఉత్పత్తి 100మిలియన్ టన్నులకు చేరుకునే విధంగా పంచవర్ష ప్రణాళికను ఏర్పాటు చేసుకున్నది. ఇప్పటి నుంచి ప్రతి సంవత్సరం 10శాతం వృద్ధి రేటును పెంచుకుంటూ 2030నాటికి 100మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. సీఎండీ బలరాంనాయక్ దిశానిర్దేశనంలో సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, జీఎంలు, మూడవ శ్రేణి అధికారులు సమష్టిగా ఈ ప్రణాళికను ముందుకు తీసుకుపోయేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక ఇల్లందు క్లబ్‌లో రామగుండం, బెల్లంపల్లి, భూపాలపల్లి రీజియన్ల జనరల్ మేనేజర్లు, గని మేనేజర్లు, ఓసీపీల మేనేజర్లు, ఇతర అన్నీ విభాగాల ఉన్నతాధికారులతో సంస్థ డైరెక్టర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాల్లో వృద్ధి, వివిధ రంగాల్లో విస్తరణ అంశాలపై వర్క్‌షాప్ నడిచింది. ఈ అన్నిరంగాల్లో ప్రతి సంవత్సరం 10శాతం వృద్ధి రేటు సాధించేలా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. 2029-30 సంవత్సరం నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే విధంగా ముందుకు పోవాలని డైరెక్టర్లు సూచన చేశారు. అందులో 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచే 10శాతం వృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలని, సంస్థ లాభాల్లో కూడా ఈ వృద్ధి కనిపించే విధంగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వారు చెప్పారు. అందుకోసం క్షేత్ర స్థాయి నుంచి కూడా అన్ని అంశాలపై చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో భవిష్యత్‌లో పెరిగే విద్యుత్ అవసరాల దృష్ట్యా బొగ్గు అవసరాలు ఉంటాయని, అందుకు సింగరేణి సంస్థ ఈ ఐదేళ్లలో 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా వివిధ విభాగాలు రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచుకోవడానికి సిద్ధం కావాలన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా థర్మల్, సౌర, జియో థర్మల్ ఉత్పత్తిలో కూడా అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించే విషయంపై సింగరేణిలోని ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని, పోటీ ప్రపంచంలో ప్రైవేట్ సెక్టార్‌తో సింగరేణి పోటీపడే విధంగా ఎదగాలన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలన్నారు. ప్రధానంగా భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశ విద్యుత్ అవసరాల్లో సింగరేణి సంస్థ తనవంతు భాగస్వామిగా ఉండడం సింగరేణీయులకు గర్వకారణమని డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణ అన్నారు. ఇదే వర్క్‌షాప్‌లో సింగరేణి 100మిలియన్ టన్నుల భవిష్యత్ బొగ్గు ఉత్పత్తి ప్రణాళిక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 10శాతం వృద్ధి సాధించే విషయాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవడం, ఉద్యోగుల హాజరుశాతం పెంచడం, నూతన బొగ్గు గనులను ప్రారంభించుకోవడం, బొగ్గు రవాణా, యంత్రాల పని సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించడం, రక్షణ సూత్రాలు పాటించడం అంశాలపై కూడా పవర్ పాయింట్ ప్రజంటేషన్ జరిగింది. ఈ సమీక్షలో ఆర్‌జీ-1, 2, 3 జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్‌వీ సూర్యనారాయణ, ఎన్ సుధాకర్‌రావు, కే వెంకటేశ్వర్లు, భూపాలపల్లి జీఎం ఎస్‌డీ హబీబ్ హుస్సేన్, బెల్లంపల్లి రీజియన్ జీఎంలు డీ రవి ప్రసాద్, బీ సంజీవరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఏ మనోహర్, రవికుమార్, ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, కార్పొరేటర్ జీఎంలు, ఏజెంట్లు, ఏరియా ఇంజనీర్లు, నిట్ ప్రాజెక్టు మేనేజర్లు, ప్రాజెక్టు ఇంజనీర్లు, గ్రూప్ ఇంజనీర్లు, ఫైనాన్స్, ఐఈడీ మేనేజర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ మండలంలో ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

- యాసంగి సీజన్‌లో 3.11 లక్షల క్వింటాళ్ల సేకరణ - రైతులకు చెల్లింపులు పూర్తి



కొనుగోలు కేంద్రం నుంచి లారీలో తరలిస్తున్న ధాన్యం బస్తాలు

సుల్తానాబాద్, మే 21: సుల్తానాబాద్ మండలంలో యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. మండలంలో సుల్తానాబాద్, చిన్నకలువల, కనుకుల, సుద్దాల, గర్రెపల్లిలో సహకార సంఘాలు ఉన్నాయి. ఈ ఐదు సహకార సంఘాల ద్వారా 3లక్షల 11వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ సహకార సంఘాల ద్వారా మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సమీపంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతీ రెండు లేదా మూడు గ్రామాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయి వాటిని మూసివేయగా గర్రెపల్లి సొసైటీ పరిధిలో మాత్రం మరో రెండు రోజుల్లో అన్ని కేంద్రాలను మూసివేయనున్నారు. సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి కొనుగోళ్లు ముగిసిన కేంద్రాలను వెంటనే మూసివేయాలని, మిగిలిన కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దాంతో మంగళవారంతో చాలా సెంటర్లు మూసివేశారు. సుల్తానాబాద్ సంఘం పరిధిలో చిన్నకలువల పరిధిలో తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కనుకులలో నాలుగు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను, సుద్దాలలో రెండు గ్రామాల్లో కేంద్రాలను, గర్రెపల్లిలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ సొసైటీ పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో ఒక లక్ష పది క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశారు. సుల్తానాబాద్‌లో ఇరవై వేల క్వింటాళ్లు, పూసాలలో 19 వేలు, కదంబాపూర్‌లో 15 వేలు, నీరుకుళ్లలో 8 వేలు, శాస్త్రినగర్‌లో 9 వేల 500 క్వింటాళ్లు, గట్టేపల్లిలో 10వేలు, కాట్నపల్లిలో 11 వేల 200, సుగ్లాంపల్లిలో 8వేల 500, కందునూరిపల్లిలో 9 వేల 800 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. సుద్దాల సొసైటీ పరిధిలో 520 మంది రైతుల నుంచి 38 వేల 850 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. కనుకులలోని కనుకులలో 10వేల 292 క్వింటాళ్లు, తొగర్రాయిలో 14వేల248 క్వింటాళ్లు, మంచరామిలో 12 వేల 209 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. చిన్నకలువల సొసైటీ పరిధిలో చిన్నబొంకూరు సెంటర్‌లో 12 వేల క్రింటాళ్ళు, చిన్నకలువల గ్రామంలో 3 వేల 500 క్వింటాళ్లు, నారాయణపూర్‌లో 14వేలు, కొదురుపాకలో 16 వేలు, పెరుకపల్లిలో నాలుగు వేల క్వింటాళ్లు, మియాపూర్‌లో 5వేల 400 క్వింటాళ్లు, రెబ్బల్దేవ్‌పల్లిలో ఐదు వేల 700 క్వింటాళ్లు, దేవునిపల్లిలో ఆరు వేల క్వింటాళ్లు, వాగొడ్డుపల్లిలో రెండు వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. గర్రెపల్లి సొసైటీ పరిధి బొంతకుంటపల్లిలో 1,781క్వింటాళ్లు, భూపతిపూర్‌లో 9,997 క్వింటాళ్లు, సాంబయ్యపల్లిలో 11,430,దుబ్బపల్లిలో 4,046, నారాయణరావుపల్లిలో 6,237, నర్సయ్యపల్లిలో 4,286 క్వింటాళ్లు, ఐతరాజుపల్లిలో 11,126 క్వింటాళ్లు, గర్రెపల్లిలో 11,120 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఆయా సంఘాల పరిధిలోని రైతులందరికీ వెంటనే ధాన్యం డబ్బులను వారి ఖాతాలలో జమ చేసినట్లు సీఈవోలు బూరుగు సంతోష్, రమేష్, శంకరయ్య, పెరుక సతీష్, నబీలు తెలిపారు.

కార్యవర్గం

కోల్‌సిటీ, మే 21: ఎఫ్‌సీఐ ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గతంలో ఉన్న కార్యవర్గాలన్నింటిని రద్దు చేశారు. గౌరవ అధ్యక్షులుగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, అధ్యక్షులు ఎండీ ఆసిఫ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ అమీర్ ఎన్నికయ్యారు. సలహాదారుగా రాజయ్య, ఉపాధ్యక్షులు టీ ఓదెలు, ఎస్ కృష్ణ, కోశాధికారిగా సాంబమూర్తితో పాటు ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, ఐదుగురు ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎన్నికయ్యారు. 1982 సంవత్సరంలో ప్లాట్లు అలాట్ అయినవారు, వారి వద్ద కొనుగోలు చేసిన వారే ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో హక్కుదారులవుతారని, ఏ ఇతర లావాదేవీలు, నకిలీ డాక్యుమెంట్లను అనుమతించబోమని కార్యవర్గం పేర్కొన్నది.

రైతులకు అవగాహన సదస్సు

కమాన్‌పూర్, మే 21 : మండలంలోని గుండారం గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వివిధ అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, రాబోయే వర్షకాలంలో వివిధ వరి వంగడాలు, వరి కోత అనంతరం చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మురళీ, మంథని, ముత్తారం, కమాన్‌పూర్ వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియ ముందుకు సాగేనా?

● దోలాయమానంలో ఆర్టీసీ ఉద్యోగులు ● ప్రభుత్వం స్పందించాలని వినతి

భగత్‌నగర్, మే 21: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినా ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. 2019 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులు విలీనం చేయాలని సమ్మె చేసినా ఆ దిశగా అడుగులు వేయని ప్రభుత్వం 2023 ఆగస్టు నెలలో ఒక్కసారిగా విలీన ప్రక్రియను ముందుకు తీసుకు వచ్చి మంత్రివర్గ సమవేశంలో చర్చించి బిల్లును ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించారు. విలీన బిల్లుకు సెప్టెంబరులో గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తంతు ముగిసినా విధి విధానాల రూపకల్పనకు ఓ కమిటీని వేసింది. ఆ తర్వాత వచ్చిన ఎన్నికల కోడ్‌లతో విలీన ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు మద్దతు ప్రకటిం చిన నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగు లు విలీన ప్రక్రియపై ఆశలు పెట్టుకున్నారు.

కరీంనగర్ రీజియన్‌లో 3,472 మంది ఉద్యోగులు

కరీంనగర్ రీజీయన్‌లో 11 ఆర్టీసీ డిపోలు ఉండగా 3472 మంది ఉద్యో గులు ఉన్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, జగిత్యాల, వేములవాడ, సిరిసిల్ల, మంథని, హుజూరాబాద్, హుస్నాబాద్, కోరుట్ల, మెట్‌పల్లి డిపోలు ఉన్నాయి. గోదావరిఖనిలో 524 మంది ఉద్యోగులు, హుస్నాబాద్‌లో 210, హుజూరాబాద్‌లో 253, కరీంనగర్-1 డిపోలో 423, కరీంనగర్-2లో 384, మంథనిలో 211, జగిత్యాలలో 435, కోరుట్లలో 226, మెట్‌పల్లిలో 231, సిరిసిల్లలో 266, వేములవాడలో 250 మంది ఉద్యోగులతో పాటుగా మిగతా 59 మంది కలుపుకుని 3472 మంది ఉద్యోగులు ఉన్నారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తయితే రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల పరిధిలోని ఉద్యోగులందరికీ లాభం జరిగే అవకాశం ఉంది.

ఆందోళనలో రిటైర్డ్ ఉద్యోగులు

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా ప్రభుత్వం విలీన ప్రక్రియ గెజిట్ పబ్లిష్ చేసిన తర్వాత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విలీన ప్రక్రియ ముగిసిన తర్వాత తమకు ప్రభత్వ ఉద్యోగుల మాదిరిగా రావాల్సిన మొత్తాలను అందించాలని రిటైర్డ్ అయిన ఉద్యోగులు కోరుతున్నారు. గత సెప్టెంబర్ నెలలో 8 మంది, అక్టోబర్ నెలో 8 మంది, నవంబర్ నెలలో 8, డిసెంబర్ నెలలో 11 మంది, జనవరి నెలలో 15 మంది, ఫిబ్రవరి నెలలో 10, మార్చి నెలలో 13 మంది, ఏప్రిల్ నెలలో 20 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. గత సంవత్సరం విలీన ప్రక్రియ గెజిట్ విడుదల అయినప్పటి నుంచి ఇప్పటి వరకు 93 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

జూలై 3 నుంచి ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) రిక్రూట్‌మెంట్ ర్యాలీని జూలై 3 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. 3ఏఎస్‌సీ ఎయిర్‌ఫోర్స్ సంస్థ ఖాన్‌పూర్, 7ఏఎస్‌సీ, 1 కబ్బన్‌రోడ్, బెంగుళూరు కర్ణాటకలో నిర్వహించనున్న ఈ ర్యాలీలో పాల్గొనటానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెళ్లి కాని భారతీయ పురుషులు, మహిళల కోసం అగ్నివీర్ వాయు కోసం రిజిస్ట్రేషన్ ఆధారిత రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహిస్తుం దన్నారు. దీనికి సంబంధించి ఇంటెక్ 01/2025 రిక్రూట్‌మెంట్ కోసం జాబ్ నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. అగ్నిపథ్ పథకం ప్రవేశంతో క్లరికల్/టెక్నికల్ క్యాడర్లలో ఉద్యోగావకాశాలు ఇపుడు నాలుగు సంవత్సరాల సర్వీసుకు పరిమితం చేయబడుతుందని, అభ్యర్థులలో 25శాతం మందికి శాశ్వత ప్రవేశం కల్పించ బడుతుందని పేర్కొన్నారు. అభ్యర్థి అవివాహితుడై, 2జనవరి, 2004 నుంచి 2 జూలై 2007 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి కనీస పాస్ మార్కులతో పదవ తరగతి ఉత్తీర్ణత/సమాన విద్య కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు టెంపో, పిచ్, ఒక పూర్తి పాట పాడడంలో కచ్చితత్వంతో సంగీతంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22 ఉదయం 11 గంటల నుంచి జూన్ 5 వరకు రాత్రి 11 గంటల వరకు వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

జగిత్యాల టౌన్, మే 21:జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎల్లాల గోపాల్ రెడ్డి తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గోపాల్ రెడ్డి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ట్రేస్ చేసి రికవరి చేశారు. మంగళవారం బాధితుడికి సీఐ వేణు గోపాల్ చేతుల మీదుగా అందజేశారు. టౌన్ ఎస్సై నరేష్, మన్మధరావు ఉన్నారు.

విద్యుత్ స్తంభాలకు ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

సిరిసిల్ల క్రైం, మే 21: సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో మంగళవారం ఉదయం ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొంది. మానేరువాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సాయినగర్ రోడ్డుపై వెళ్తోంది. అజాగ్రత్తతో అతివేగంగా డ్రైవింగ్ చేయడంతో అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు స్తంభాలు విరిగి కిందపడ్డాయి. తీగలు తెగిపోయాయి. దీంతో ఆ కాలనీలోని పలు ఇళ్లల్లో టీవీలు, రిఫ్రిజిరేటర్‌లు ఒక్కసారిగా కాలిపోయాయి. ఏం జరిగిందోనని ప్రజలు ఆందోళన చెందారు. ప్రమాదం జరిగిన కొంత సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లన్నీ సాయినగర్ కాలనీలో నిలిచిపోవడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ప్రతీ రోజు ఇసుక రవాణాతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన చేశారు. ఈ సంఘటన తెలుసుకున్న సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరణలో నిమగ్నమయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. నారాయణపూర్ గ్రామ సమీపంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపారని పేర్కొన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని చెప్పారు. నారాయణపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పోదరి రాకేశ్, వాహన యజమాని గోగూరి ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



ఆలయం ఎదుట భక్తులు

మల్యాల, మే 21: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవుల నేపథ్యంలో సోమవారం రాత్రికే వేలాదిగా కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోడానికి బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య ఇతర అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. కాగ కొండ పైన అలిశెట్టి విష్ణు అనే భక్తుడు సెల్‌ఫోన్, నగదుతో కూడిన బ్యాగ్ పోగోట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్ సిబ్బందితో వెతికి భక్తుడికి అప్పగించారు.

రూ. 7,400 పలికిన పత్తి ధర



జమ్మికుంట రూరల్, మే 21: జమ్మి కుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,400 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 22 మంది రైతులు 270క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఏడు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,400, కనిష్ఠ ధర ఐదు వేలు చెల్లించి కొన్నారు.

వివాహిత హత్య



మమత (ఫైల్)

మెట్‌పల్లి, మే, 21 : మెట్‌పల్లి పట్టణానికి చెందిన సంగం మమత(38)అనే మహిళ మంగళవారం హత్యకు గురైంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన సంగం మమత కొంత కాలంగా అబ్దుల్ అఫ్సర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం నడిపిస్తోంది. మమత తన భర్తతో నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకుని కొడుకు, కూతురుతో కలిసి పట్టణంలోని వేరుగా ఉంటోంది. అప్సర్ తరుచుగా మమత ఇంటికి వస్తూ ఉండే వాడు. సోమవారం రాత్రి మమత, అప్సర్‌ల మధ్య గొడవ జరిగింది. అప్సర్ కోపంతో మమ తను గొంతు నులిమి, కత్తితో పొట్టలో పొడవడంతో తీవ్ర రక్తస్రావంతో పడిపోయిం ది. గమనించిన కూతురు 108లో ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందిన ట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. మమత కూమారుడు సంగం గ్రహిత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం



ధర్మపురి, మే 21: ధర్మపురి మండలంలోని రాయపట్నం నది బ్రిడ్జి కింద గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గల మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

శంకరపట్నం, మే 21: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల హన్మంతు (70) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల హన్మంతుకు అతని తమ్ముడు బొంతల సమ్మయ్యతో భూవివాదం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. సమ్మయ్య హన్మంతును, అతని కుటుంబ సభ్యులను తిడుతూ చంపుతానని బెదిరించాడు. దీంతో హన్మంతు మనస్తాపానికి గురై ఈ నెల 18న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందతూ మృతి చెందాడు. మంగళవారం హన్మంతు కుమారుడు బొంతల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

జమ్మికుంట రూరల్, మే 21: మండలంలోని విలాసాగర్ సమీపంలోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నాగంపేట గ్రామం వద్ద హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, పెట్రోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా విలాసాగర్ మానేరు నుంచి వస్తున్న రెండు ఇసుక లారీలను స్వాధీనం చేసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీల యాజమానులు వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చందుపట్ల జితేందర్‌రెడ్డి, వేములవాడకు చెందిన ముద్రకోల మహేష్, డ్రైవర్లు జాన ప్రశాంత్, ఎరుకల అంజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

రుద్రంగి మే 21: మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సాన్ని సృష్టించిన సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం మానాల గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి వెళ్తున్న క్రమంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్టాండ్ ప్రాంతంలోని డివైడరును ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పరిశీలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

మానకొండూరు, మే 21: మండలంలోని అన్నారంలో మంగళవారం ఓ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి కరీంనగర్ నుం చి మండలంలోని అన్నారం గ్రామానికి వరివిత్తనాలతో వ్యాన్ బయలు దేరింది. అన్నారం గ్రామంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, మే 21: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పరిధిలోని వేంనూర్ గ్రామంలో సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గాయపడిన దీకొండ మహేందర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. మహేందర్ కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన వ్యక్తి అని ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

మల్లాపూర్, మే, 21 : మండలంలోని ముత్యంపేట గ్రామంలోని వాకిటి గంగవ్వ మారు రాజశ్రీల ఇళ్లల్లోకి పిచ్చికుక్క చొరబడి దాడి చేసిన ఘటనలో మంగళవారం ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపి న వివరాల ప్రకారం..గ్రామంలో మధ్యాహ్నం వాకిటి గంగవ్వ అను వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తోంది. అదే సమయంలో పిచ్చికుక్క ఇంట్లోకి చొరబడి గంగవ్వ ముఖంపై, ఎదురింట్లో ఉన్న మారు రాజశ్రీ కాళ్లను కొరికి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన స్థానికులు, కుంటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని వారిని ఆసపత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చికుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

వైభవంగా నరసింహ జయంత్యుత్సవాలు



నరసింహ స్వామివారు

ముగిసిన నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 21: ధర్మపురి క్షేత్రంలో శ్రీ నరసింహ జయంతి ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారం భమైన నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్చారణల మధ్య ఆలయ ముఖ్య అర్చ కులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుష సూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసక పూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. పంచోపనిషత్తులతో మన్యసూక్తం, నున్నాల వన్నము, రుద్రంతో అభిషేక పూజలు, విశేష పూజ లు, పంచోపనిషత్తులో అభిషేకం, సహస్ర నామా ర్చన, హారతి, వేద మంత్ర పుష్పం, చతుర్వేద అవధార్యాలు, ప్రత్యేక పూజలు, సప్త హారతులు నిర్వహించారు.

సాయంత్రం వేళలో స్తంబోద్భవ కాలంలో విశేష పూజలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాల కు, శ్రీ స్వామి వారలకు, దేవాల యాల కు ప్రత్యేక పూల అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి నిత్యం మూడు వాటర్ కూలర్స్‌తో పాటు అదనంగా మరో రెండు చోట్ల లడ్డూ కౌంటర్ ముందు, దేవాలయం ఎదుట చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గోదావరిలో స్నానాలు చేసిన అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారలను దర్శిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ వేదపండి తులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి క్షేత్రంలో నరసింహ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి, దర్శనం చేసుకున్నారు. ఆలయ వేద పండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించి, స్వామి తీర్థ, ప్రసాదాలు అందించారు.



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, స్వామి వారలకు హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, స్వామి వారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలి

కేడీసీఏ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21: జిల్లా క్రీడాకారులు క్రికెట్ శిక్షణ శిబిరాలలో నేర్చుకున్న మెళ కువలతో ముున్ముందు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మురళీధర్ రావు అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు మంగళవారం ఉదయం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా గల కేడీసీఏ ప్రధాన మైదానంలో గత నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన ఉచిత వేసవి శిక్షణ శిబిరం సోమ వారం ఉదయం ముగిసింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను, శిక్షణ శిబిరాలు నిర్వ హిం చిన కోచ్‌లకు మెమొంటోను ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడా కారులు క్రమ శిక్షణకు మారు పేరుగా నిలవాలన్నారు. నెల రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న అండర్ 14,16,19,23, వయసు విభాగాల బాల బాలికలకు ప్రశం సాపత్రాలను అందించారు.



క్రీడాకారుడికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మురళీధర్ రావు

వడదెబ్బతో కౌలు రైతు మృతి



సుల్తానాబాద్, మే 21 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంట పల్లి గ్రామానికి చెందిన పోలాడి నర్సింగరావు (70) అనే రైతు వడదెబ్బతో మృతిచెందాడు. తాను కౌలుకు తీసుకున్న 2 ఎకరాల్లో సోమవారం పెసర్లు అలికి ఇంటికి రాగా, ఎండ తీవ్రతకు అస్వస్థత గురయ్యాడు. మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఇంటికి రాగా సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య గతంలో మృతిచెందగా, పిల్లలు లేరు.

మైతాపూర్ బ్రిడ్జి వద్ద ధాన్యం లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రాయికల్, మే 21: మండలంలోని మైతాపూర్ బ్రిడ్జి వద్ద ధాన్యం తరలిస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. రాయికల్ నుంచి కోరుట్లకు ధాన్యం తీసుకువెళ్తున్న లారీ మైతాపూర్ బ్రిడ్జిపైకి రాగానే బోల్తా పడింది. మైతాపూర్ బ్రిడ్జిపై ఇటీవల కాంట్రాక్టర్ మట్టి పోయడంతో మట్టిలో దిగబడి లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. కాగా విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్లు తురగ శ్రీధర్, వల్లకొండ మహేష్ గౌడ్, రైతులు బోల్తా పడిన లారీని, ధాన్యం బస్తాలను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుందని, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. బ్రిడ్జి పనులు నడుస్తున్నాయని హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అలాగే పనులు నడుస్తున్నప్పుడు వాహనాలు వెళ్లడానికి కనీసం మట్టి రోడ్డు నిర్మాణం చేయలేదన్నారు. ఎక్కువ గుంతలు ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్లు మట్టి రోడ్డు నిర్మాణం చేయించి, బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

ఠాణా ఎదుట ఎస్సై భార్య ఆందోళన

● రెండో పెళ్లి చేసుకొని.. తమకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన





కుటుంబ సభ్యులతో ఆందోళన చేస్తున్న మానస, మానస, పిల్లలతో ఎస్ఐ నాగరాజు (ఫైల్)

చేర్యాల, మే 21 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్సై నాగరాజు తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడని, పిల్లలను బలవంతంగా తీసుకెళ్లాడని అతడి మొదటి భార్య మానస మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఎదుట తల్లి, బంధువులతో కలిసి ఆందోళనకు దిగింది. నాగరాజు రెండో భార్య వల్ల తనకు, తన పిల్లలకు ప్రాణ హాని ఉందని, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

కరీంనగర్ జిల్లా గోపాల్ పూర్‌కు చెందిన మానసకు కొమురవెల్లి ఎస్సై నాగరాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఎస్సై నాగరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని మానసను వేధిస్తున్నాడు. కొంతకాలం క్రితం మానసను, పిల్లలను కరీంనగర్‌లో ఉంచాడు. అప్పుడప్పుడు అక్కడికి వచ్చి పోయేవాడు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండు నెలల క్రితం బలవంతంగా పిల్లలను తీసుకెళ్లి.. వాళ్ల ఎక్కడున్నారో మానసకు చెప్పకుండా విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. దీంతో మానస ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆమె సూసైడ్ నోట్ రాసి పెట్టుకోగా గమనించిన కుటుంబ సభ్యులు కలుగ జేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో విరమించుకుంది. తన భర్త విషయాన్ని సిద్దిపేట సీపీ, చేర్యాల సీఐ, కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోతోంది. తనకు, తన ఇద్దరు పిల్లలకు ఎస్సై నాగరాజు రెండో భార్యతో ప్రాణహాని ఉందని, నాగరాజు, పిల్లలు తనతో కలిసి ఉండేలా న్యాయం చేయాలని ఆమె మంగళవారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగింది. అయితే, ఎస్సై నాగరాజు సెలవులో ఉన్నారని సిబ్బంది చెప్పారు. తనకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించనని అక్కడే కూర్చుంది. ఈ విషయమై సీఐ శ్రీనును సంప్రదించగా, విషయాన్ని మానస ఇటీవల తన దృష్టికి తీసుకువచ్చారని.. కౌన్సెలింగ్ చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్



గణేశ్‌నగర్, మే 21: శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న వీసీ పదవీ కాలం పూర్తి కావడంతో ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. కొత్త వీసీలు నియమితులు అయ్యే వరకు వీరు విధుల్లో కొనసాగనున్నారు. ఇప్పటికే కొత్త వీసీల కోసం యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి

జగిత్యాల టౌన్, మే 21: జిల్లా కేంద్రంలోని 10వ వార్డులోని లింగంపేట శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన నిమ్మని శిరీష తన కూతురు విన్మయి(3)తో కలిసి లింగంపేటలో ఎల్లమ్మ పట్నాల కార్యక్రమానికి హాజరైంది. తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం శిరీష నడుపుతున్న వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో వాహనంపై ఉన్న చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. హుటా హుటిన జగిత్యాలలోని ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. తల్లి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలకుర్తిలో వ్యక్తి..

పాలకుర్తి, మే 21: మండల పరిధిలోని ఎయిర్‌పోర్టు సమీపంలో మంగళవారం జరిగిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో జయ్యారం గ్రామానికి చెందిన జంగ శంకర్(40) మృతిచెందాడు. ధర్మారం ఎక్స్‌రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొత్తపల్లి గ్రామం నుంచి ఎక్స్‌రోడ్డుకు వెళ్తున్న పోతు నరేష్ ద్విచక్రవాహనంపై వచ్చి బలంగా ఢీకొట్టడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య శిరీష, కూతూరు వైష్ణవి, కుమారుడు చర్రి ఉన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

సుల్తానాబాద్, మే 21 : మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన వేల్పుల అంజయ్య(55) అనే గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. రోజువారిగా మంగళవారం కూడ అంజయ్య గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. వ్యవసాయ బావి దగ్గర గొర్రెలు మేస్తుండగా పక్కనే ఉండి గమనిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడి మృతిచెందాడు. అంజయ్యకు భార్య కేతమ్మతో పాటు కుమారుడు ఉన్నాడు. కేతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

చొప్పదండి, మే21: చొప్పదండి మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన బైరగోని ఆనందం(45) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం మేరకు బైరగోని ఆనందం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆరునెలలుగా వ్యాపారం నడవకపోవడంతో నష్టాలపాలై జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారు జామున ఇంటిముందు బాల్కని ఇనుప చువ్వకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలు వచ్చి తరచు బాదపడుతుండే వాడని, ఆనందం భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ రూరల్, మే 21: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. ఎదురుగట్ల గ్రామంలో అదే గ్రామానికి చెందిన పస్తం శ్రీనివాస్ ఆటోలో అక్రమంగా 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తర లిస్తుండగా మంగళవారం రూరల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలుంటాయని ఎస్సై హెచ్చరించారు.

రాయికల్‌లో భారీ చోరీ

సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు

రాయికల్, మే 21: రాయికల్ పట్టణంలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. పట్టణానికి చెందిన బుడిక విజయలక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి భారీ చోరీకి పాల్పడ్డారు. మంగళవారం సాయంత్రం బంధువుల ఇంటి నుంచి తన ఇంటికి చేరుకున్న విజయలక్ష్మికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండ టంతో అనుమానంతో ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చి ఇంట్లోకి వెళ్లింది. ఇంట్లో బీరువా పగులగొట్టి ఉండగా, అందులో ఉన్న సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష నగదు మాయం కావడంతో చోరీ జరిగినట్లు గ్రహించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై అజయ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వివరాలు సేకరిస్తున్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు


మంథనిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, మే 21: దేశంలో నూతన సాంకేతిక విప్లవానికి నాంది పలికింది మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్ అన్నారు. రాజీవ్‌గాంధీ 33వ వర్థంతి సందర్భంగా గోదావరిఖని చౌరస్తాలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి దేశ మొత్తం విస్తరించారని, దేశ పురోభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. యువతను రాజకీయ రంగానికి ప్రోత్సహించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిన మహనీయుడని, తీవ్రవాదంపై ఉక్కుపాదం మోపి, చివరకు ముష్కరుల చేతిలో అమరత్వం పొందిన రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీటి బాలరాజు, మారెల్లి రాజిరెడ్డి, కార్పొరేటర్లు ఎండీ ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విప్రకాష్, నాయకులు గట్ల రమేష్, కొప్పుల శంకర్, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలు, సుతారి లక్ష్మణ్‌బాబు, సింహాచలం, పంజా శ్రీనివాస్, దూళికట్ట సతీష్, కౌటం సతీష్, ఉదయ్‌రాజ్, మాలెం మధు, కల్వల రంజిత్, దాసరి విజయ్, ఇండ్ల ఓదెలు, పవన్, శంకర్, రవి, సాంబమూర్తి, అనుమ సత్యనారాయణ, బొంతల లచ్చన్న, అడప కిరణ్, నజీమోద్దీన్, మొబిన్, గుమ్మడి రవి, ఈదునూరి మల్లేష్, ఈదునూరి రవి, మార్క రాజు, రమేష్‌గౌడ్, అరవింద్, పూసాల శ్రీనివాస్, అల్లి శంకర్, సాగర్ ముదిరాజ్, కోటేశ్వర్, అభిషేక్ పాల్గొన్నారు.

గోదావరిఖని : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు దిక్సూచిగా నిలిచాయని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్థంతి సందర్భంగా మంగళవారం స్థానిక జనక్ భవన్‌లో జరిగిన వర్థంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజీవ్‌గాంధీ టెలికాం కమ్యూనికేషన్, టెక్నాలజీ రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారని, ఆ ఫలితాలను ఇప్పుడు దేశం అనుభవిస్తున్నదన్నారు. పారిశ్రామికంగా కూడా రాజీవ్‌గాంధీ అనే మార్పులు తీసుకువచ్చారని, తన చివరి ఊపిరి ఉన్నంత వరకు దేశం కోసం పరితపించారన్నారు. దేశం కోసం ప్రణాలర్పించిన ధీరుడని, నిరుపేదలకు ఆపద్బంధుడని జనక్ ప్రసాద్ కొనియాడారు. ఆర్జీ-1 ఉపాధ్యక్షులు సదానందం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్మపురి, దాస్, వికాస్‌కుమార్‌యాదవ్, ఆరెపల్లి శ్రీనివాస్, పోచయ్య, మల్లికార్జున్, సాగర్, జగన్మోహన్, సమ్మయ్యయాదవ్, లగిశెట్టి ఆంజనేయులు, సిరిపురం నర్సయ్య, గణపతి దామోదర్, అన్వేష్, సదానందం, సురేష్, తాటి రాజయ్య, పాకాల సాయి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం కాలనీ కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో రాజీవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. రాజీవ్‌గాంధీ హయాంలో దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, పారిశ్రామిక రంగాలకు పెద్ద పీట వేశారని పేర్కొన్నారు. నేడు కంప్యూటర్, మొబైల్ అందరికీ అందుబాటులో ఉన్నాయంటే దానికి రాజీవ్‌గాంధీ చేపట్టిన సంస్కరణలే కారణమని తెలిపారు. 18ఏళ్ళకు ఓటు హక్కు తగ్గించడం, పంచాయతీ వ్యవస్థను మూడంచెల విధానంలో ప్రవేశపెట్టి గ్రామ పాలన బలోపేతం అయ్యేలా రాజీవ్ గాంధీ కృషి చేసినట్టు తెలిపారు. దేశానికే గాక కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, దామోదర్‌రావు, చక్రపాణి, అనుము రాములు, సారయ్యనాయక్, అవినాష్, మార్క రాజు, రాజేషం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ కార్యక్రమంలో జరిగిన రాజీవ్ గాంధీ వర్థంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో సైదులు, జాన్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

జూలపల్లి : దివంగత మాజీ ప్రధానమంత్రి, కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయి నాయకుడు రాజీవ్‌గాంధీ వర్థంతిని మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ అన్ని వర్గాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, ఎంపీటీసీ దండె వెంకటేశం, ఎండి గౌస్ పాషా, చీదురు శ్రీనివాస్, ఎండి ఫకీర్, ముమ్మాడి రవి, కనుకయ్య, సాయిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మంథని : దేశాభివృద్ధి కోసం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఇనుముల సతీష్, ఐలి ప్రసాద్ వొడ్నాల శ్రీనివాస్‌లు అన్నారు. స్థానిక మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జూలపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

జాతీయ స్థాయి క్రికెట్‌లో రాణించాలి

- కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగంరావు


సర్టిఫికెట్ అందజేస్తున్న కేడీసీఏ అధ్యక్షుడు

కోల్‌సిటీటౌన్, మే 21: ప్రతి ఒక్క క్రీడాకారుడు ఆటలో నైపుణ్యాన్ని పెంచుకొని జాతీయస్థాయి క్రికెట్‌లో రాణించాలని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఆగంరావు ఆకాంక్షించారు. కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలన్నర రోజులుగా గోదావరిఖని జీఎం గ్రౌండ్ విజయవంతంగా నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కేడీసీఏ అధ్యక్షులు ఆగంరావు క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్‌లో గోదావరిఖని ప్రాంతంలో నిర్వహించిన శిబిరంలో దాదాపు 250 మందికిపైగా అండర్ 14,16,19 క్రీడాకారులు పాల్గొని శిక్షణ తీసుకోవడం సంతోషదాయకమన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధంగా కొనసాగుతున్న కేడీసీఏ రానున్న రోజుల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తయారు చేసే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా టోర్నమెంట్‌లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. మానసికంగా, శారీరంగా క్రీడాకారులు ధృడంగా ఉండాలని, అప్పుడే ఆటలోని నైపుణ్యం, మెలకువలు ఉపయోగపడి క్రికెట్‌లో రాణించేందుకు దోహదపడుందని సూచించారు. బాలికలు కూడా క్రికెట్‌లో రాణించేందుకు ఆసక్తి చూపించాలని, వారికి ఎన్నో అవకాశాలున్నాయని తెలిపారు. గోదావరిఖనిలో భారీ ఎత్తున వేసవి శిక్షణ శిబిరం నిర్వహించి నెలరోజుల పాటు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన కిరణ్‌కుమార్, కోచ్ సుదేష్, సిబ్బందిని అభినందించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం శిక్షణ పొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను ఆగంరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు డి.కిరణ్‌కుమార్‌యాదవ్, కోచ్ సుదేష్, చంద్రశేఖర్, రవి, శ్రీకాంత్‌లతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఆదరణ కరువు

- ఏటా తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య


కాల్వశ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కాల్వశ్రీరాంపూర్, మే 21: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సంఖ్య తగ్గిపోతూ ఉంది. ఈ పాఠశాలలో గత సంవత్సరం 14 మంది ఉపాధ్యాయులతో పాటు ఆరు నుంచి పదవ తరగతి వరకు కేవలం 123 మంది విద్యార్థులు ఉన్నారు. ఎంతో గొప్ప పేరు ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య ఇంకా పడిపోయే ప్రమాదం ఉంది. మరోవైపు ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నత విద్యతోపాటు శిక్షణ పొందివారే. అన్ని సబ్జెక్టులకు బోధించే ఉపాధ్యాయులు ఉన్నా ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను పంపించేందుకు గ్రామీణ ప్రాంతవాసులు ఆసక్తి చూపకపోగా ప్రయివేటు పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా గత సంవత్సరం రూ.30లక్షల ప్రభుత్వ నిధులతో ఈ పాఠశాల అభివృద్ధి జరిగింది. ఎంతో పేరున్న కాల్వశ్రీరాంపూర్ ఉన్నత పాఠశాలకు పూర్వవైభవం తీసుకవచ్చేందుకు ప్రజాప్రతినిధులు, తోపాటు ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు వేదభవనంలో నమ్మాళ్వారుల తిరునక్షత్రం

కరీంనగర్ కల్చరల్, మే 21: నగర శివారులోని వేదభవనంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 మంది ఆళ్వారులలో ఒకరైన నమ్మాళ్వార్ తిరునక్షత్రం (జయంతి) నిర్వహిస్తున్నట్లు వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు. సేవాకాలం, కోయిల్ తిరువాయిమొజి పారాయణం, నమ్మాళ్వారులకు అభిషేకం కార్యక్రమా లుంటాయని పేర్కొన్నారు.

అలంకారప్రాయంగా గ్రామీణ క్రీడా ప్రాంగణాలు

- మూడు గ్రామాల్లో నిర్మాణానికి నోచుకోని క్రీడాప్రాంగణాలు

- ఎంపీడీవో కార్యాలయంలోనే క్రీడా కిట్లు - క్రీడాకారుల అసహనం..



కల్వచర్లలోని గ్రామీణ క్రీడా ప్రాంగణం


ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న క్రీడా కిట్లు

రామగిరి, మే 21: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణంలో అలంకారప్రాయంగా మారాయి. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో 14 గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మాణం పూర్తి చేశారు. మండలంలోని పెద్దంపేట్, రాజాపూర్, వెంకట్రావ్‌పల్లి గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేని కారణంగా క్రీడాప్రాంగణాలు నిర్మాణానికే నోచుకోలేదు. ఎన్నికలకు ముందుగా ప్రాంగణ నిర్మాణం పూర్తి అయిన కల్వచర్ల, లొంకకేసారం, ఆదివారంపేట్ గ్రామపంచాయతీలకు ఇప్పటివరకు క్రీడాకిట్లు పంపిణీకి నోచుకోలేదు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్రీడాప్రాంగణాలు పశువులకు పాకలుగా, ముళ్ల పొదలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రాంగణాలకు కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లే తమ సొంత ఖర్చులతో నిర్మాణం చేపట్టినట్లు తెలుపుతున్నారు. క్రీడాప్రాంగణాలు చుట్టూ ఈజీఎస్ ద్వారా మూడు వందల మొక్కలు నాటే నిబంధనలు ఉన్నప్పటికి పిచ్చి మొక్కలే దర్శనం ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఉపయోగంలోకి రాకపోవడం గమనార్హం.

ఎన్నికల కోడ్‌తో ఆలస్యం : ఎంపీడీవో శైలజ

క్రీడాప్రాంగణాలకు కిట్ల పంపిణీకి ఎన్నికల కోడ్ అడ్డురావడంతో కొంతమేర జాప్యం చోటు చేసుకుంది. మండలంలో మూడు గ్రామపంచాయతీల్లో స్థలం లేని కారణంగా నిర్మాణం జరగలేదు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆయా గ్రామపంచాయతీలకు క్రీడా కిట్లను పంపిణీ చేస్తాం.

యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

అంతర్గాం, మే 21: ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో వరిధాన్యం కొనుగోళ్లు యుద్ధ ప్రాతిపదిన జరుపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు మేరుగు చంద్రయ్య అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇటీవల కురిసిన అకాల వర్షం కారణంగా రైతుల ధాన్యం తడిసి నష్టం వాటిల్లిందన్నారు. కొనుగోళ్లు వేగవంతంగా చేయకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకపోయాయని, మళ్లీ వర్షం రాకముందే కొనుగోళ్లు జరిపి రైతులు నష్టపోకుండా ఆదుకోవాలన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుల ఈదునూరి నరేష్, ఐ కృష్ణ, కొల్లూరి మల్లేష్, కోడిపుంజుల భూమేష్, వేల్పుల సాంబయ్య, రాజయ్య పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న రైతుకూలి సంఘం నాయకులు

కార్మిక కుటుంబాలకు కలుషిత నీరు సరఫరా

- మినరల్ వాటర్ సరఫరా చేయాలి - టీబీజీకేఎస్ నాయకుల డిమాండ్


గోదావరిలో డ్రైనేజీ నీరు కలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు


సింగరేణి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

గోదావరిఖని, మే 21: రామగుండం రీజియన్‌లోని మూడు డివిజన్ల కార్మిక వాడలకు, కుటుంబాలకు సింగరేణి యాజమాన్యం విషతుల్యమైన నీటిని తాగేందుకు సరఫరా చేస్తున్నదని టీబీజీకేఎస్ కేంద్ర నాయకత్వం ఆరోపించింది. గోదావరి నదిలో నీరు లేకపోవడంతో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత డ్రైనేజీ వ్యర్థాలతో కొట్టుకువచ్చిన నీటినే సరైన విధంగా శుద్ధిచేయకుండా కార్మిక వాడలకు, కుటుంబాలకు సింగరేణి యాజమాన్యం సరఫరా చేస్తున్నదని వారు అన్నారు. మంగళవారం టీబీజీకేఎస్ కేంద్ర నాయకులు నూనె కొమురయ్య, మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, చల్లా రవీందర్‌రెడ్డి, రొడ్డ సంపత్, ఉప్పులేటి తిరుపతి తదితరులు బృందంగా వెళ్లి గోదావరినదిలో సింగరేణి ఫిల్టర్ బెడ్‌లను, ఇన్‌టేక్ వెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సరఫరా చేస్తున్న కార్మిక కుటుంబాలు తాగవద్దని పిలుపునిచ్చారు. గోదావరినదిలో సింగరేణి యాజమాన్యం నిర్మించిన మంచి నీటిబావుల పైభాగం నుంచి చుక్క నీటి ప్రవాహం కూడా లేదన్నారు. పారిశ్రామిక ప్రాంతం నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు గోదావరినదిలో కలుస్తున్నదని వారన్నారు. ఈ డ్రైనేజీతో పాటు కలుషితమైన నీటి ప్రవాహాన్ని పంపుల ద్వారా గంగానగర్ వద్ద ఉన్న ఫిల్టర్‌బెడ్‌కు పంపిస్తున్నారని, అక్కడ కూడా నీటిని పరిశుభ్రం చేయడం లేదన్నారు. గోదావరిఖనికి 24లక్షల మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం ఉందని, అందుకు తగినట్టుగా ఫిల్టర్‌బెడ్ నిర్మాణం జరుగలేదన్నారు. గోదావరిఖని ఫిల్టర్‌బెడ్ నుంచి ఫైవింక్లయిన్, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీ కాలనీ కార్మిక నివాస ప్రాంతాలతో పాటు సింగరేణిపై ఆధారపడిన ఇతర కాలనీలు, ఇతర ప్రజలు కూడా ఇవే నీరు తాగాల్సి వస్తున్నదన్నారు. నీటి ఎద్దటి తీవ్రంగా ఉన్నదని తెలిసినప్పటికీ సింగరేణి యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదన్నారు. సింగరేణి ఫిల్టర్ బెడ్‌లలో శుభ్రపరిచిన నీటితో పాటు రావాటర్ కూడా కలిపి పంపుతున్నట్టు తమ పరిశీలనలో తేలిందన్నారు. సింగరేణి యాజమాన్యం వెంటనే కార్మిక వాడలకు మినరల్ వాటర్‌ను సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్ష పోరాటాలకు దిగాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

ఇప్పటికైనా సింగరేణి అధికారులు అలసత్వాన్ని వీడి నీటి ఎద్దడి నివారణకు, కలుషిత నీటిని నివారించేందుకు, శుద్ధమైన నీటిని సరఫరా చేసేందుకు సిద్ధం కావాలని వారు డిమాండ్ చేశారు.

రేణుక ఎల్లమ్మ బోనాలు


బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, మే 21: మండలంలోని రేగడిమద్దికుంటలో గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గౌడ కులస్థులు తమ కుటుంబ సభ్యులతో కలసి ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యాన్ని తయారు చేసి బోనంను తలపై పెట్టుకుని గ్రామంలో సామూహికంగా ఊరేగింపుగా ఎల్లమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే విజయరమణారావు గౌడ కులస్థులతో కలసి తలపై బోనం ఎత్తుకుని ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు పలువురిని నిర్వాహకులు సన్మానించారు. ఎంపీపీ బాలాజీ రావు, జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాష్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గట్టు శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ శ్రావణ్‌కుమార్, బీజేపీ నాయకులు సదయ్య గౌడ్ తదితరులతో పాటు గ్రామ గౌడ సంఘం ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అప్పన్నపేట గ్రామంలో..

పెద్దపల్లి రూరల్, మే 21: మండలంలోని అప్పన్నపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి బోనాలు నిర్వహించగా మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బోనమెత్తుకొని ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. మహిళలు నెత్తిన బోనమెత్తుకొని డప్పు చప్పుళ్ల నడుమ ఆలయానికి చేరుకొని మొక్కులు సమర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు గోపగాని సారయ్యగౌడ్, కోట శ్రీనివాస్ గౌడ్, అరె సంతోష్‌కుమార్, మందల సత్యనారాయణరెడ్డి, రాజేందర్, ఎల్లయ్యగౌడ్, రాజమౌళి, సదయ్య, ప్రశాంత్‌గౌడ్, శ్రీదర్, శ్రీనివాస్, శివాజీ, సురేష్, సంతోష్, మహేష్, శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కిష్టంపేట గ్రామంలో..

కాల్వశ్రీరాంపూర్, మే 21: మండలంలోని కిష్టంపేట గ్రామంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఈ బోనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, కాంగ్రెస్ నాయకులు తులా మనోహర్‌రావు, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, సబ్బని రాజమల్లు, గీసా రాజయ్యగౌడ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

వడుకాపూర్ గ్రామంలో..

జూలపల్లి, మే 21: మండలంలోని వడుకాపూర్ గ్రామంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మతల్లి బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ చరిత్రలో గతంలో ఎన్నడు లేనివిధంగా గౌడ కులస్థులతో పాటు మాదిగ కులస్థులు కలిసి రేణుకా ఎల్లమ్మతల్లికి బోనాలను సమర్పించేందుకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యం, బెల్లం సాకం, కల్లు ఆరగింపు చేసి తమ పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున గౌడకులస్థులు, మాదిగ కులస్థులు, మహిళలు పాల్గొన్నారు.

'అన్ని రకాల ధాన్యానికి బోనస్ వర్తింపజేయాలి'

ఓదెల, మే21: అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్‌ను వర్తింపజేయాలని బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని గూడెంలో మంగళవారం పలువురు రైతులు, బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కేవలం సన్న రకాలకు బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సమంజసం కాదని దొడ్డు రకాలకు కూడ బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులను పావులుగా వాడుకొని మోసం చేయవద్దని ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. మాజీ సర్పంచ్ ఉసికమల్ల చంద్రమౌళి, రేగుల సంపత్, తిప్పారపు మహేష్, చిట్ల గణేష్, సాగర్, రాకేష్ పాల్గొన్నారు.

చెరువు నీటిని పరిరక్షించాలి

జూలపల్లి, మే 21: మండలంలోని పెద్దాపూర్ గ్రామ పరిదిలోని పెద్దచెరువు నుండి వృదాగా పోతున్నా సాగునీటిని నిలుపుదల చేయించాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన సంకెండ్ల లక్ష్మినర్సయ్య పలువురు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ ని కలిసి వినతిపత్రం అందజేసారు. పెద్దచెరువు తూముకు సరైనా ఏర్పాట్లు లేక సాగు నీల్లు వృదాగ పోతున్నాయని, రాబోయే రోజుల్లో పశువులకు నీల్లు దొరకలేని పరిస్తితులు దాపురిస్తున్నాయన్నారు. పెద్దచెరువు తూముకు ఆన్‌ఆఫ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి నీటిని వృదా కాకుండా చూడాలని వారు అదనపు కలెక్టర్‌ను కోరారు. జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో సంకెండ్ల లక్ష్మినర్సయ్య, కల్లెపెల్లి ఉమెందర్, కంకనాల లక్ష్మినర్సయ్య, కంకనాల వెంకటేశ్, కంకనాల రవి పాల్గొన్నారు.

అకాడ శిక్షణ తరగతులు ప్రారంభం

కోల్‌సిటీటౌన్, మే 21: గోదావరిఖని మల్లికార్జున్‌నగర్‌లో అకాడ మాస్టర్ అడ్లూరి వెంకటయ్య ఆధ్వర్యంలో మంగళవారం అకాడ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు సోమారపు అరుణ్-లావణ్య దంపతులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాడ విద్య ఎంతో ప్రాచీనమైనదని, మానసిక, శారీరక ఉల్లాసానికి, దారుఢ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు పంగ రవి, ఎ.రాజేష్, బండారి శ్యాం, వివిధ శాఖల అకాడ మాస్టర్లు, చిన్నారులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు 'హెల్పింగ్ హ్యాండ్స్' చేయూత

కమాన్‌పూర్, మే 21: మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన కల్వల సతీష్ అనే నిరుద్యోగ యువకుడికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు చేయూతనందించారు. చెట్టు కింద టీస్టాల్ నడుపుతూ జీవనం సాగిస్తున్న అతని పరిస్థితిని చూసిన హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్, ఆసమ్ శ్రీకాంత్‌లు మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్లో ఒక గదిని అద్దెకి తీసుకొని ముందర తడకలు వేయించి, కొత్త టీ క్యాబిన్‌తో పాటు ముడి సరుకుకి పెట్టుబడి సాయం కింద రూ. 21000లను అందించగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆపదలో, సహాయం కోసం ఎదురు చూసే వారికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఎల్లవేళలా ముందుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మెడగొని ఇవజయ్, జబ్బార్‌ఖాన్, నల్లవెల్లి శంకర్, చదువు వెంకట్‌రెడ్డి, సూర భాస్కర్, అనవేణి లక్ష్మీరాజం, గీసగొని శ్రీనివాస్‌రెడ్డి, చైతన్య, బుర్ర శ్రీనివాస్, మల్యాల విజయ్, మల్యాల నరేష్, మల్యాల మహేష్ ఉన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు

కమాన్‌పూర్, మే 21: మండల కేంద్రంలో గత సంవత్సరం ప్రతిష్ఠాపన చేసిన బొడ్రాయి వార్షికోత్సవం మంగళవారం మండల కేంద్రంలోని అంగడి బజార్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛ రణ మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త తప్పనిసరి

- మండల వ్యవసాయాధికారి అలివేణి

పెద్దపల్లి రూరల్, మే 21 : ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలో వివిధ రకాల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్త వహించాలని పెద్దపల్లి మండల వ్యవసాయాధికారి అలివేణి సూచించారు. వ్యవసాయ పనులు ప్రారంభం కంటే ముందు నుంచే రైతులతో ఏఈవోలు సమావేశాలు నిర్వహించి విత్తనాల కొనుగోలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎరువుల దుకణాదారులు సైతం నిబంధనలు పాటిస్తూ రైతులకు సహకరించాలని లేని యెడల చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వారికి సూచిస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఫర్టిలైజర్స్, ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను తనిఖీలు చేసి వారి రికార్డులు, స్టాక్ వంటి వివరాలను సేకరించడంతో పాటు, నకిలీలపై అప్రమత్తంగా ఉండటంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఏవో అలివేణి పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువుల విక్రయాలు, కంపనీల పూర్తి వివరాలన్ని నిత్యం వ్యవసాయ శాఖకు తెలిపేలా ఉండాలని సూచించారు.